# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 179 | విశాఖపట్నం | 31-3-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 179 | VISAKHAPATNAM | 31-3-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



పతాకం న్యూస్
ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు


సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


# 2029కి అందరికీ ఇళ్లు

## టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు






**తిరుపతి, పతాకం న్యూస్:** ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ 2029 నాటికి ఇల్లు నిర్మించి ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రతి పేద కుటుంబానికి శాశ్వతంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలనేదే కూటమి సర్కార్ సంకల్పమని తెలిపారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పుదూరులో టిడ్కో గృహాల గృహ ప్రవేశ కార్యక్రమంలో సీఎం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించారు. టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో 2 లక్షల 50 వేల 893 గృహాలను ప్రభుత్వం అందించింది. జీ+3 విధానంతో సకల హంగులు, పూర్తి నాణ్యతతో ఈ ఇళ్లను నిర్మించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, అనగాని, పార్థసారథి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2.50 లక్షల మంది గృహప్రవేశాలు జరుగుతున్నాయంటే చరిత్ర అని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది రెండోసారి గృహప్రవేశాలు చేస్తున్నామని వెల్లడించారు. పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు. 2029 వరకు ఇళ్లు లేని వారి ఇల్లు నిర్మించి ఇస్తామని తిరుపతి జిల్లాలో 15,659 ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. మట్నత్తం డిసెంబర్‌లోపు 10 లక్షల ఇళ్లు పేదలకు కట్టించి అందజేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. "రూ.174 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తాం. గత ప్రభుత్వ నేతలు అర్బన్ కింద కేంద్రం ఇచ్చిన డబ్బులు దుర్వినియోగం చేశారు. అలానే గత ప్రభుత్వం రూ.816 కోట్లు అప్పు పెట్టింది. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం యత్నించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేదలు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించింది. చరిత్రలో వైఎస్సార్సీపీ లాంటి ప్రభుత్వాన్ని చూడలేదు. వీళ్లైతే మంచి చేయాలి విధ్వంసం పనికిరాదు. నాలుగోసారి సీఎంగా పని చేస్తున్నానంటే ఇది ప్రజాభిమానం. ప్రజలను కించపరిచేలా దుష్ప్రచారాలు చేస్తే సహించం." అని చంద్రబాబు హెచ్చరించారు. కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని 63 లక్షల మందికి మొదటి తేదీనే పింఛన్లు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని అలానే స్త్రీశక్తి కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమం అందిస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా పోలవరాన్ని గత ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. (తరువాయి 2వ పేజీలో)




తమిళనాడు రాజకీయాల్లో కీలక ఘట్టం..

## నామినేషన్ వేసిన విజయ్




## విజయనగరం సబ్ జైల్‌లో హోం మంత్రి అనిత ఆకస్మిక తనిఖీ




## స్మార్ట్‌ఫోన్ అతిగా వాడితే మానసిక సమస్యలు. రేడియేషన్ ప్రభావం: డాక్టర్ శ్రీనివాస్



# మావోయిస్టు ఫ్రీ స్టేట్‌గా ఏపీ: డీజీపీ

**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు మావోయిస్టు ఫ్రీ స్టేట్‌గా మారిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు ఒకరోజు ముందే తాము ఆ లక్ష్యాన్ని చేరుకోగలిగామని వెల్లడించారు. ఈ ప్రయత్నంలో పలుచోట్ల ఎదురుకాల్పులు, లొంగుబాట్లు జరిగాయని ఇంక అరెస్టులు కూడా చేశామని విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. నేటితో వామపక్ష తీవ్రవాదం రాష్ట్రంలో ముగింపు దశకు వచ్చిందని పేర్కొన్నారు. ఎస్ఐబీ, ఇంటలిజెన్స్, ప్రత్యేక బృందాలు ఇందుకోసం చాలా బాగా పని చేశాయంటూ వారిని డీజీపీ ప్రశంసించారు. మావోయిస్టులు లొంగిపోయి (తరువాయి 2వ పేజీలో)

# రెండు చోట్ల పోటీ..

# విజయ్ వ్యూహాత్మక తప్పిదమా?



(పతాకం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)


తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికల్లో విజయ్ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని పెరంబూర్ , తిరుచిరాపల్లిలోని తిరుచ్చి ఈస్ట్ స్థానాలను ఆయన ఎంచుకున్నారు. తొలిసారి బరిలోకి దిగుతున్న ఒక కొత్త పార్టీ నాయకుడు రెండు చోట్ల పోటీ చేయడం వ్యూహాత్మక తప్పిదమయ్యే అవకాశం కనిపిస్తోంది.

### ఆత్మవిశ్వాసమా.. లేక అభద్రతా భావమా?

నేటి రాజకీయాల్లో ఏ నాయకుడైనా రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారంటే, ప్రజల్లోకి వెళ్లే మొదటి సంకేతం అభద్రతా భావం . ఒకే చోట గెలుస్తామన్న నమ్మకం లేకనే సేఫ్ సైడ్ కోసం రెండో స్థానాన్ని ఎంచుకున్నారన్న అభిప్రాయం ఓటర్లలో బలంగా నాటుకుపోతోంది. గతంలో రేవంత్ రెడ్డి, కె. చంద్రశేఖర్ రావు (వంటి దిగ్గజాలే తమ కంచుకోటలతో పాటు వ్యూహాత్మక పోటీ అని (తరువాయి 2వ పేజీలో)

# యువతిని హత్య చేసిన నేవీ ఉద్యోగి





## ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో పెట్టిన యువకుడు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డబ్బులు కోసం యువతి వేధించిందని హత్య చేసి ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో పెట్టాడో నేవీ ఉద్యోగి. ఒక ఇంట్లో రెండు ముక్కలుగా నరికి సగ భాగంను ఫ్రిజ్‌లో పెట్టి, మరో సగ భాగంను గోనె సంచిలో కట్టాడు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఈ ఘటన విశాఖ జిల్లాలో చోటు చేసుకుంది. అసలేం జరిగిందంటే.. నేవీలో టెక్నీషి యన్‌గా పని చేస్తున్న చింతాడ రవీంద్ర(35) విశాఖలో ఎల్‌వి. నగర్‌లో స్థానికంగా ఓ అపార్టుమెంట్‌లో ని వాసం ఉంటున్నాడు. అయితే ఇతడి భార్య నెల క్రితం ప్రసవం కోసం విజయనగరంలోని పుట్టిం టికి వెళ్లారు. ఈ క్రమంలో గతంలో తనకు పరి చయం ఉన్న విశాఖకు చెందిన మౌనిక(29)ను రవీంద్ర తన ఇంటికి ఆహ్వానించాడు. దాంతో ఆదివారం మధ్యాహ్నం ఆమె అతని ఫ్లాట్‌కు వెళ్లింది. ఆపై ఇరువురూ ఇంట్లో కాసేపు చర్చించుకున్నారు. ఆ తర్వాత మౌనిక, రవీంద్ర మధ్య ఘర్షణ నెలకొంది. దాంతో చివరకు రవీంద్ర అత్యంత పాశవికంగా మౌనికను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా నరికి సగ భాగంను ఫ్రిజ్‌లో పెట్టి, మరో సగ భాగంను గోనె సంచిలో భద్రపరి చాడు. ఆపై శరీర భాగాలను ఫ్రిజ్‌లో పెట్టాడు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వచ్చి జరిగిందంతా చెప్పి అధికారులకు లొంగిపోయాడు. ఆ తర్వాత పోలీసులు అతడిని సంఘటనా స్థలానికి తీసుకునివెళ్లి ఫ్రిజ్‌లో రెండు మూటల్లో ఉన్న శరీర భాగాలను (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఆదుకోవాలి..

తెలుగు రాష్ట్రాలలో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్నను రైతులు సాగు చేసి, ఎకరాకు 30-40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారు. గత ఏడాది ప్రభుత్వ సంస్థ మార్క్ ఫెడ్‌తో సంబంధం లేకుండానే బహిరంగ మార్కెట్లో మొక్కజొన్నకు మంచి ధర పలికింది. క్వింటాల్ మొక్క జొన్నకు ప్రభుత్వం రూ.2400 కనీస మద్దతు ధరగా ప్రకటించింది. ఆ రేటుకు కొనేవారెవరూ లేరు. మొక్కజొన్న మద్దతు ధర రూ.2400 వున్నప్పటికీ బయట మార్కెట్లో దళారులకు రూ.1400 నుండి రూ.1700కి అమ్ముకుంటూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది పరిస్థితి మరింత దారుణంగా మారింది. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో దళారీలు రాజ్యమేలుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. మొక్కజొన్నను ఇథనాల్ తయారీలో కూడా వాడతారు. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెట్రోల్ దిగుమతులు తగ్గించటానికి మొక్కజొన్న నుండి తయారు చేసిన ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపమంటున్నది. ఫలితంగా మొక్కజొన్న అవసరం, డిమాండ్ మరింత పెరిగింది. యుద్ధం వలన పెట్రోలు దిగుమతులు కష్టంగా వుండటంవల్ల మొక్కజొన్న నుండి ఇథనాల్ ఉత్పత్తి మరింత కీలకమైంది. మొక్కజొన్న ఖరీదు తక్కువగా ఉండటంతో ఇథనాల్ తయారీ కంపెనీలు సంతోషంగా వున్నాయి. ఇంకా ధర తక్కువ కావాలని కోరుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ వున్నా రైతుకు ధర రావటం లేదు. పైగా ధర తగ్గుతున్నది. మొక్కజొన్న సాగు చేసిన రైతులకు వ్యాపారస్తులు చుక్కలు చూపిస్తున్నారు. వ్యాపారస్తులు సిండికేటై రైతులను దోపిడీ చేస్తున్నారు. మొక్కజొన్న రైతులను నిలువునా ముంచుతున్నారు. అమెరికా వ్యవసాయానికి వెన్నెముక మొక్కజొన్న అమెరికా వ్యవసాయానికి వెన్నెముక వంటిది. అమెరికా రాజకీయ లాబీలలో మొక్కజొన్న రైతుల పాత్ర ప్రముఖమైనది. అమెరికా ప్రభుత్వ సబ్సిడీలలో సింహభాగం మొక్కజొన్న రైతులదే. ప్రపంచంలోని మొత్తం మొక్కజొన్న ఉత్పత్తిలో దాదాపు 30.99 శాతం వాటాతో, అమెరికా అగ్ర స్థానంలో నిలిచింది. హెక్టారుకు 11 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో టర్కీ తర్వాతి స్థానంలో ఉంది. అందుకే మొక్కజొన్న మార్కెట్ కోసం ప్రపంచమంతా గాలిస్తున్నది. హెక్టారుకు 3 మెట్రిక్ టన్నుల ఉత్పాదకతతో భారతదేశం 66వ స్థానంలో ఉంది. భారతదేశంలో వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న మూడవ అత్యంత ముఖ్యమైన ధాన్యపు పంటగా ఉంది. దేశంలోని మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఇది సుమారు 10 శాతం వాటాను కలిగి ఉంది. అమెరికాలో మొక్కజొన్న ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో, దిగుమతి చేసుకోమని భారతదేశంపై ఒత్తిడి చాలా ఎక్కువగా వుంది. దిగుమతి సుంకాలు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను కొనమని బెదిరిస్తూ పోరుకాడుతున్నారు. విదేశాల నుంచి సునామీలా వచ్చిపడుతున్న దిగుమతులతో మన పంటకు కొనుగోలు ధర తగ్గింది. స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర రూ. 2,928 లేకపోయినా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2400 రూపాయలకైనా కొనటం లేదు. పెరుగుతున్న పెట్టుబడులు-తరుగుతున్న ధరలు వ్యవసాయ ఖర్చులన్నీ పెరుగుతున్నాయి. దున్నకం, కలుపులు, ఎరువులు, పురుగు మందులు, రవాణా చార్జీలు, కౌలుతో సహా అన్నీ పెరుగుతున్నాయి. అమెరికా ప్రాంభించిన యుద్ధంతో ఎరువులకు రెక్కలు వచ్చాయి. మొక్కజొన్న, శనగ, వరి పంటలలో నూర్పిడి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. మానవ శ్రమకు బదులుగా యాంత్రీకరణ మొదలవటంతో కూలీల పనిదినాలు తగ్గాయి. పెట్టుబడి పెరుగుతున్నది. ఎరువులు, విత్తనాలు, డీజిల్ తదితర ఖర్చులు పెరగడం వల్ల క్వింటాలు మొక్కజొన్న పండించడానికి అయ్యే ఖర్చు కూడా పెరిగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం సగటు హెక్టార్ సాగు ఖర్చు, రూ.1,18,156. కాగా, క్షేత్ర స్థాయిలో ఇది మరింత ఎక్కువగా ఉంటోంది. రైతుకి ఎంత నష్టం? కనీస మద్దతు ధరను అమలుపరచక పోవడంతో, రైతు క్వింటాల్ మొక్కజొన్న బహిరంగ మార్కెట్లో అమ్మినందున రూ.700 నుంచి రూ.800 వరకూ నష్టపోతున్నాడు. ఎకరానికి రైతుకు న్యాయంగా రావలసిన 30-40 వేల రూపాయలు రావటం లేదు. రైతు చేతిలోంచి దళారీలు, ఇథనాల్ కంపెనీలు కొట్టుకుపోతున్నాయి.

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..
## రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్



**రాజ్‌కోట్, పతాకం న్యూస్:** విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి. రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' (ూఌూ=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు. ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది. ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

(మొదటిపేజీ తరువాయి)

## విజయ్ వ్యూహాత్మక తప్పిదమా?

రెండో చోట పోటీచేసి ఓడిరపోయారు. 2023 తెలంగాణ ఎన్నికల్లో కామారెడ్డిలో వీరిద్దరూ పోటీ పడి.. చివరకు ఒక సామాన్య అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఇప్పుడు విజయ్ కూడా అదే తరహాలో రెండు చోట్ల నిలబడటం వల్ల ఓటర్లకు ఆయనపై ఉన్న నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

### రెండు పడవల ప్రయాణం - ఇరుక్కునే ఛాన్స్

విజయ్ ఎంచుకున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు చాలా బలంగా ఉన్నారు. పెరంబూర్ స్థానంలో డిఎంకె సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్.డి. శేఖర్ తన పట్టును నిరూపించుకోగా, తిరుచ్చి ఈస్ట్‌లో ఇనిగో ఇరుదయరాజ్ గట్టి పోటీని ఇస్తున్నారు. ఈ రెండు చోట్లా విజయ్ ఒకే సారి దృష్టి సారించడం కష్టతరమైన పని. ప్రచారం కోసం ఒక నియోజకవర్గంలో ఎక్కువ సమయం కేటాయిస్తే, రెండో చోట ప్రజలు మమ్మల్ని పట్టించుకోవడం లేదు అనే భావనకు వచ్చే అవకాశం ఉంటుంది. ఫలితంగా రెండు చోట్లా ఓటర్లు ఆయనకు వ్యతిరేకంగా మొగ్గు చూపే అవకాశం లేకపోలేదు. అదే సమయంలో ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలి. ఏ నియోజకవర్గంలోనూ ఎక్కువగా ప్రచారం చేయలేరు.

### అస్తిత్వ పోరాటంలో ఇబ్బందులు

కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వ్యక్తికి ఒక కంచుకోట ఉండటం చాలా అవసరం. అది తన సొంత నియోజకవర్గంగా ప్రజల్లో ముద్ర వేసుకోవాలి. కానీ విజయ్ రెండు చోట్ల పోటీ చేయడం వల్ల ఆయన అసలు ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నారు? అనే స్పష్టత ప్రజలకు అందడం లేదు. దీనివల్ల ఆయనను కేవలం ఒక గెస్ట్ క్యాండిడేట్ గా మాత్రమే స్థానిక ఓటర్లు చూసే ప్రమాదం ఉంది. పైగా రెండు చోట్లా గెలిస్తే ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వస్తుంది, అది ఆ నియోజకవర్గ ప్రజలను అవమానించినట్లు అవుతుందనే ప్రచారం ప్రత్యర్థులు అప్పుడే మొదలుపెట్టారు.

### చరిత్ర పునరావృతమవుతుందా?

ఇటీవలి కాలంలో రెండు చోట్ల పోటీ చేసి రెండు చోట్లా గెలిచిన సందర్భాలు చాలా తక్కువ. ఒకవేళ గెలిచినా మెజారిటీలు చాలా స్వల్పంగానే ఉంటున్నాయి. విజయ్ తన సినిమాల మాదిరిగా రాజకీయాల్లో కూడా డబుల్ రోల్ సక్సెస్ అవుతుందని భావిస్తున్నారేమో కానీ, క్షేత్రస్థాయి రాజకీయాలు అందుకు భిన్నంగా ఉంటాయి. డిఎంకె, అన్నాడీఎంకే వంటి బలమైన కేడర్ ఉన్న పార్టీలను ఎదుర్కోవాలంటే ఒకే చోట నిలబడి గట్టిగా పోరాడటం ఉత్తమ వ్యూహం కావొచ్చు. కానీ విజయ్ మాత్రం రెండు చోట్ల పోటీకే నిర్ణయం తీసుకున్నారు.

## యువతిని హత్య చేసిన నేవీ ఉద్యోగి

గుర్తించారు. మౌనిక డబ్బుల కోసం తరచూ వేధించేదని, ఆ హింసను భరించలేకే ఈ హత్య చేసినట్లు నిందితుడు రవీంద్ర పోలీసులకు వెల్లడించాడు. నిందితుని స్వస్థలం విజయనగరం జిల్లా రాజాంగా అధికారులు గుర్తించారు. అనంతరం గాజువాక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మౌనిక హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. డేటింగ్ యాప్‌లో రవీంద్రకు మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. మౌనికకు ఇప్పటివరకు రూ.3.50 లక్షలు ఇచ్చినట్లు పోలీసులకు రవీంద్ర చెప్పారు. ఉద్యోగ ఐడీ కార్డు కూడా తీసుకుని సొమ్ము డిమాండ్ చేసిందని రవీంద్ర తెలిపారు. లాక్‌డౌన్ సమయం నుంచే మౌనికతో రవీంద్రకు పరిచయం ఉన్నట్లు తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఎల్?వీ నగర్‌లోని కీర్తి అపార్టుమెంట్‌కు మౌనిక వచ్చింది. అపార్టుమెంట్‌కు వచ్చిన కాసేపటికే రవీంద్ర, మౌనిక మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఘర్షణ తర్వాతే హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. యువతి డబ్బుల కోసం వేధించిందని, హింస భరించలేకే హత్య చేశానని నిందితుడు చెప్పినట్లు సమాచారం. మౌనిక హత్య కోసం రవీంద్ర ముందేగానే గాజువాకలో కత్తులు కొన్నట్లు తెలుస్తోంది. మౌనిక శరీరాన్ని మూడు భాగాలుగా ముక్కలు చేసి రెండు భాగాలు ఫ్రిజ్‌లో ఉంచి తలభాగం విశాఖ దారపాలెంలో పడేసినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి మౌనిక తల, ఆమె ఫోన్ దారపాలెం తోటల్లో తగలబెట్టినట్లు తెలిసింది. హత్య చేసిన తర్వాత రవీంద్ర రక్తపు మరకలు కడిగి, వాసన రాకుండా సెంట్ కొట్టినట్లు సమాచారం. హత్య అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి విషయం చెప్పి అతని సూచన మేరకు పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది.

## తమిళనాడు రాజకీయాల్లో కీలక ఘట్టం..
## నామినేషన్ వేసిన విజయ్



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించిన ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్, సోమవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ పరిణామం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. చెన్నైలోని వ్యాసర్పాడిలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో రిటర్నింగ్ అధికారికి విజయ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సి.టి.ఆర్. నిర్మల్ కుమార్ వంటి ముఖ్య నేతలు ఆయన వెంట ఉన్నారు. విజయ్ నామినేషన్ కార్యక్రమానికి ఊహించని రీతిలో ప్రజా స్పందన లభించింది. ఆయన రాకకు గంటల ముందే వ్యాసర్పాడికి దారితీసే ప్రధాన మార్గాలు, కాలేజీ ప్రాంగణం వెలుపల వేలాది మంది టీవీకే కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా గుమిగూడారు. రాష్ట్రంలో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీవీకే పార్టీకి పెరుగుతున్న రాజకీయ ఆదరణకు ఈ జనసందోహం అద్దం పట్టింది. విజయ్ ప్రచార వాహనం ఆ ప్రాంతం గుండా వెళ్తుండగా, అభిమాన నటుడిని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు దూసుకొచ్చారు. ఈ భారీ జనసందోహం కారణంగా వ్యాసర్పాడిలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఒక సిగ్నల్ జంక్షన్ వద్ద విజయ్ కాన్వాయ్ క్షణకాలం ఆగడంతో కొందరు వాహనదారులు సెల్ఫీలు తీసుకునే ప్రయత్నంలో తమ వాహనాలను నిలిపివేశారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విజయ్ నామినేషన్ కార్యక్రమం ఒక రకంగా బలప్రదర్శనగా మారిందని, క్షేత్రస్థాయిలో ఆయన రాజకీయ ప్రవేశంపై ఉన్న ఉత్సాహాన్ని ఇది తెలియజేస్తోందని పార్టీ వర్గాలు అభివర్ణించాయి. విజయ్ పోటీతో పెరంబూర్ నియోజకవర్గం చెన్నైలో అత్యంత ఆసక్తికరమైన పోటీ కేంద్రాల్లో ఒకటిగా మారింది. ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్న టీవీకే, అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెడుతోంది. రానున్న రోజుల్లో తమిళనాడులో ఎన్నికల ప్రచారం మరింత హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

(మొదటిపేజీ తరువాయి)

## 2029కి అందరికీ ఇళ్లు

గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. అనకాపల్లిలో స్టీల్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని దాని ద్వారా లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. హైదరాబాద్, చెన్నై కంటే అమరావతిని నెంబర్ వన్‌లో నిలబెడతామని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని అలానే సాంకేతికత ఎప్పటికప్పుడు అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రాజధానిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపామని చట్టం రూపుదాల్చాక రాజధానిని ఎవరూ కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుడుతున్నానని బాగా పనిచేసిన అధికారిని అభినందిస్తానని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లోనే అడుగుతానని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

## మావోయిస్టు ఫ్రీ స్టేట్ ఏపీ: డీజీపీ

జనజీవన స్రవంతిలో రావాలని తాము పిలుపు ఇచ్చామని ఇందుకు స్పందించి సీనియర్ మావోయిస్టు నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ సహా మరో ఎనిమిది మంది లొంగిపోయారని వెల్లడించారు. వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకుమని, లొంగిపోయిన వారికి స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూస్తామని డీజీపీ తెలిపారు. గత ఏడాది కాలంగా మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో ఏపీ పోలీసులు అద్భుత విజయాలు సాధించారని డీజీపీ వివరించారు. రూ.20 వేలు వంతున రివార్డు: సుమారు 36 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ నేత, కేంద్ర కమిటీ సభ్యులు, ఏవోబీ స్పెషల్ జోనల్ కార్యదర్శి చెల్లూరి నారాయణరావుతో పాటు కంపెనీ కమాండర్ కొరతం లచ్చు, ఏరియా కమిటీ సభ్యురాలు పోడియం రాజే సహా కీలక సభ్యులు తుపాకీ వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. అగ్రనేత సురేష్‌కు రూ.25 లక్షలు రివార్డు ఉందని, కొరతం లచ్చుకు రూ.5 లక్షలు, నలుగురు ఏరియా కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, మిగిలిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున రివార్డులున్నట్లు తెలిపారు. వీరందరికీ తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.20 వేల నగదును అందించారు. "లొంగుబాటు సమయంలో పోలీసులు అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 1-ఇన్సాస్, 2-బీజీఎల్?లు, రైఫిళ్లు సహా మొత్తం 19 ఆయుధాలు ఉన్నాయి. గత ఏడాది కాలంలో వామపక్ష తీవ్రవాద నిర్మూలనలో పోలీసులు విశిష్ట విజయాలు సాధించారు. ముగ్గురు సెంట్రల్ కమిటీ సభ్యులు హిడ?మ, గాజర్ల రవి, మెట్టురి జోగారావు సహా మొత్తం 18 మంది కేడర్ ఎదురుకాల్పుల్లో చనిపోయారు." అని హరీష్ కుమార్ గుప్తా తెలియజేశారు. కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో మావోయిస్టుల కుట్రలను భగ్నం చేసి 50 మంది దళ సభ్యులను అరెస్టు చేశామన్నారు. గతేడాది 18 మంది మృతి చెందగా, 81 మంది అరెస్టయ్యారని 106 మంది పోలీసుల ముందు లొంగిపోయారని తెలిపారు. రాష్ట్రంలో మావోయిస్టుల సంఖ్యను సున్నాకి తగ్గించగలిగామని ఏపీకి చెందిన వారు ఇతర రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉన్నా వారి సంఖ్య ఒకరిద్దరికి మించి లేదని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీలు ఎన్.మధుసూదన్ రెడ్డి, మహేష్ చంద్ర లడ్డా, పీహెచ్‌డీ రామకృష్ణ సహా ఇతర ఉన్నతాధికారులను ప్రశంసించారు. మారిన కాలంతో పాటు మావోయిస్టు పార్టీ తమ సిద్ధాంతాలను మార్చుకోలేదని అందుకే ప్రజల మద్దతు కోల్పోయి దెబ్బతిందని డీజీపీ ఎదుట లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు సీనియర్ నాయకుడు చెల్లూరి నారాయణరావు తెలిపారు. లొంగిపోయిన అనంతరం మీడియాతో తన స్పందనను తెలియజేశారు.

# విజయనగరం సబ్ జైల్ లో హోం మంత్రి అనిత ఆకస్మిక తనిఖీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా హోం మంత్రి అనిత స్థానిక సబ్ జైలు , రూరల్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో రికార్డులను పరిశీలించి, ఖైదీలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజన సదుపాయాలను మంత్రి అనిత స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, సీసీ కెమెరాల పనితీరు, మహిళా భద్రత కోసం పనిచేస్తున్న శక్తి టీమ్స్ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ పర్యటనలో మంత్రి అనితతో పాటు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్పీ దామోదర్ పాల్గొన్నారు.

## క్రైస్తవ్యంలోకి మారిన దళితులను ఎస్సీలుగానే గుర్తించాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దళితులు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్‌సి హోదా ఇవ్వడం జరగదని సుప్రీం కోర్టు తీర్పును పునపరిశీలించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి కోరారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మతం మారినంత మాత్రాన దళితుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ వెనుక బాటుతనం మారదని, కులవివక్ష పోదని, కానీ వారి హక్కులు మాత్రం కోల్పోవలసి వస్తుందని పేర్కొన్నారు. కులవివక్ష ఇంకా కొనసాగుతుండగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దళితులకు తీరని నష్టం చేకూరుస్తుందన్నారు. వై.రాజు మాట్లాడుతూ, మతతత్వ శక్తులు దళిత పాస్టర్లనే టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి రాజ్యాంగ మార్పునకు కృషిచేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వైటి.దాస్ మాట్లాడుతూ, దళితులు బౌద్ధం, సిక్కు మతం తీసుకుంటే ఎస్‌సి హోదా కల్పించినప్పుడు, క్రైస్తవమతం తీసుకుంటే ఎందుకు ఆ హోదా ఉండదని ప్రశ్నించారు. సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, ఈ తీర్పు దళితుల హక్కులను కాలరాసేదిగా ఉందన్నారు. సిఐటియు నాయకులు చంద్రమౌళి మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్‌ను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ పనిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి అప్పారావు, శ్రీరాములు, ప్రజాకళాకారులు శ్రీనివాస్, నరసింగరావు, అధిక సంఖ్యలో దళితులు పాల్గొన్నారు. విశాఖజిల్లా మత్స్యకారులు, మత్స్య కార్మికసంఘం ప్రధానకార్యదర్శి కె.చంద్రశేఖర్ దళితుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం నాగయ్యపేట పంచాయతీ టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు కర్రి పుష్ప & దేముళ్లు సర్పంచ్, ఉప సర్పంచ్ జక్కానా సింహాచలమ్మ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేసిన పార్టీ సీనియర్ కార్యకర్తలు నాయకులుకు ఘనంగా సన్మానం చేశారు. కర్రీ నాయుడు మాట్లాడుతూ టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ ఎన్నో పోరాటాలు చేసి తెలుగువాడు గౌరవాన్ని కాపాడి ఢిల్లీ గడ్డమీద పార్టీ జెండాను రెపరెపలాడించి ఎన్నో కష్టాలును ఎదుర్కొని పార్టీ నాలుగు సార్లు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందంటే పార్టీ కార్యకర్తలే భలం అని కర్రీ పుష్ప దేముళ్ళు, కర్రీ నాయుడు పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు. మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కర్రి సింహాద్రి అప్పల నాయుడు, కోళ్ళ దేముళ్ళు, కాగిత మరల నాయుడు, వేచలపు జోగి నాయుడు, సిరంరెడ్డి దండునాయుడు,తమటపు అక్కు నాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేచలపు శ్రీరామ్మూర్తి 1వ వార్డు కొట్యాడ రవి, వార్డు సభ్యులు కొమ్మినేని లత ఓ కృష్ణ, కర్రి శ్రీను, తూర్పాటి బంగారయ్య, తమటపు రాధ సింగంపల్లి దేముడుబాబు ,ఆదిరెడ్డి నాయుడు, గొర్లి వెంటరావు , బత్తి బుచ్చిబాబు, గాడి సూర్యనారాయణ,బీల తమ్మునాయుడు,జాజిమొగ్గల బోడేస్, గొర్లి నాయుడు బాబు, లెక్కల వెంకటేష్, పరవాడ వెంకటరావు,కర్రి శ్రీరాం,కొమ్మినేని శ్రీరాం,వంక దేముడు, కొడమంచిలి లక్ష్మీ, తదితర నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు ఈ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా అభిషిక్త్ కిషోర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం జిల్లా నూతన కలెక్టర్‌గా ముత్తింబకు అభిషిక్త్ కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి జి.సాయికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విశాఖ జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఎంఎన్.హరేంధిర ప్రసాద్ కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. విశాఖ జిల్లాకు కొత్తగా వస్తున్న కలెక్టర్ ముత్తింబకు అభిషిక్త్ కిషోర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఇండిస్టియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి) డైరెక్టర్‌గా ఉన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఈయన 2015 బ్యాచ్‌లో ఐఎఎస్‌కు ఎంపికయ్యారు.

## నగరంలో వేగ పరిమితి విధింపు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** బైక్ కొత్తదని మురిసిపోతున్నారా... కారు జెడ్ స్పీడ్‌లో వెళ్తుందని ప్రయత్నించారా... అయితే చలానా కట్టేందుకు సిద్ధంగా ఉండండి. నగర పరిధిలో గంటకు 40 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్తే జేబు గుల్లే. రూ.వెయ్యి చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని సీపీ హెచ్చరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలంతా తమ వాహనాలను గంటకు 40 కిలోమీటర్ల కంటే తక్కువ వేగంతోనే నడపాలని సీపీ సూచిస్తున్నారు. నగర పరిధిలోని జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్, మునిసిపల్‌రోడ్లపై వేగపరిమితి విధించినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-మర్రిపాలెం నుంచి కూర్మన్నపాలెం వరకు జాతీయరహదారి ఎన్‌హెచ్16పై 50 కిలోమీటర్లు, కూర్మన్నపాలెం నుంచి కొమ్మాది వరకు 40 కిలోమీటర్లు, కొమ్మాది నుంచి రాజాపులోవ జంక్షన్ వరకు 50 కిలోమీటర్లు, పినగాడి జంక్షన్ నుంచి పెందుర్తి వరకు (జాతీయరహదారి బైపాస్) 60 కిలోమీటర్లు, ఫిషింగ్‌హార్బర్ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులో 40 కిలోమీటర్లు, అన్ని బీఆర్‌టీఎస్‌రోడ్లపై 40 కిలోమీటర్లు, పెందుర్తి నుంచి బాజీజంక్షన్ వరకు 50 కిలోమీటర్లు, నగరంలోని అన్ని మునిసిపల్‌రోడ్లపై గంటకు 40 కిలోమీటర్లు గరిష్ట వేగపరిమితిగా నిర్ణయించామన్నారు. వాహనచోదకులు తమ వాహనాలను ఆయా రోడ్లపై అనుమతించిన గరిష్ట వేగపరిమితి కంటే తక్కువ వేగంతోనే వాహనాలను నడపాలని సీపీ హెచ్చరించారు. నిర్దేశించిన గరిష్ట వేగపరిమితిని దాటితే ఆయా వాహనాలను ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లేజర్‌గన్స్ ద్వారా గుర్తించి రూ.వెయ్యి జరిమానా విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడానికి రవాణాశాఖ అధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. రాంగ్‌రూట్లలో వాహనాలను నడిపితే రూ.1,500, ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తి (పిలియన్ రైడర్) హెల్మెట్ ధరించకుంటే రూ.వెయ్యి, ట్రిపుల్‌రైడింగ్‌కు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామన్నారు. వాహనచోదకులు నిబంధనలను పాటించాలని కోరారు.

## చోడవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుబజార్



**చోడవరం, పతాకం న్యూస్:** నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన మోడల్ రైతుబజారు నిర్మాణం పూర్తిచేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మొత్తం 72 దుకాణాలను షట్టర్లతో సహా నిర్మించారు. ఇది వినియోగంలోకి వస్తే ఇటు కూరగాయ రైతులకు, అటు వినియోగదారులకు మేలు చేకూరుతుంది. చోడవరం పట్టణంలో ప్రేమసమాజం రోడ్డులోని పంచాయతీ స్థలంలో ఉన్న చిన్న బజారులో రైతులు, చిరువ్యాపారులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో, టీడీపీ గత హయాంలో రూ.3 కోట్ల వ్యయంతో రైతుబజారు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు శ్రీకారం చుట్టారు. నిర్మాణం చివరి దశలో ఉండగా ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో రైతుబజారుకు గ్రహణం పట్టింది. అప్పటి వరకు చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఐదేళ్లపాటు ఎటువంటి కదలికలేదు. దీంతో చోడవరం పరిసర గ్రామాలకు చెందిన కూరగాయల రైతులు, స్థానిక చిరువ్యాపారులు ఆంధ్రా బ్యాంకు రోడ్డు, ప్రేమసమాజం రోడ్డు, లక్ష్మీపురం రోడ్డు, ప్రభుత్వ కళాశాల, కొత్తూరు జంక్షన్, పీఎస్‌పేట రోడ్డు, దేవరాపల్లి రోడ్డు.. ఇలా పలుచోట్ల తమకు అనువుగా వుండే ప్రదేశంలో కూరగాయలు అమ్ముకోవడం మొదలుపెట్టారు. దీనివల్ల రైతులు తీసుకువచ్చిన కూరగాయలు మొత్తం అమ్ముడుపోని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ రైతుబజారు, కూటమి ప్రభుత్వం రాకతో ఊపిరిపోసుకుంది. స్థానిక ఎమ్మెల్యే రాజు, రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టిసారించారు. కూరగాయలు, పూలు పండ్లు, మాంసాహార విక్రయాల కోసం వేర్వేరుగా దుకాణాలు నిర్మించారు. ఇక్కడ కూరగాయ రైతులతోపాటు స్థానిక చిరువ్యాపారులకు కూడా చోటు కల్పిస్తున్నారు. మొత్తం 72 దుకాణాలను అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకన్నా ముందే ఇక్కడి దుకాణాలను లాటరీ విధానంలో కూరగాయ రైతులు, చిరువ్యాపారులకు కేటాయిస్తారు.

## మున్సిపల్ కార్మికుల జీతాలను ప్రభుత్వమే చెల్లించాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మునిసిపల్ పారిశుధ్య కార్మికుల జీతాలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్ లో నిధులు కేటాయించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాపిత పిలుపులో భాగంగా సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 12 వ పిఆర్ సి ప్రకటించాలన్నారు. మున్సిపల్ కార్మికులు గతంలో చేసిన సమ్మె సందర్భంలో సమస్యల పరిష్కారం కోసం జివిఎంసి అధికారులు, తమ యూనియన్ తో అంగీకారానికి వచ్చారని, ఆ సమయంలో మినిట్స్ లో ఆమోదించిన, డిమాండ్లను నేటి వరకు పరిష్కరించలేదన్నారు. తక్షణం వాటిని పరిష్కరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జివిఎంసి కమిషనర్,ఎడిసి, ప్రధాన మెడికల్ అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో ఉన్న, డెత్, రిటైర్మెంట్ సిక్కులాంగ్ ఆబ్సెంట్ పోస్టులు వెంటనే ఆప్కాస్ పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. చనిపోయిన, 60 సంవత్సరాలు నిండిన కార్మికుల వారసులకు జివో ప్రకారం శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. అటువంటివారిని డైలీ పద్ధతిలో నియామకాలు చేయడం విరమించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు టైమ్ స్కేల్ వేతనాలు చెల్లించాలి అన్నారు. జివిఎంసి విలీన పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గాంధీ విగ్రహం వద్ద నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. డిమాండ్లను పేర్కొంటూ ' సమ్మె' నోటీసు సమర్పించారు. 14 రోజుల్లోగా డిమాండ్లను పరిష్కరించకపోతే, మరోసారి సమ్మెకు దిగుతామని యూనియన్ నాయకులు మీడియాకు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి. మణి ధర్నా కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లా కలెక్టర్‌గా నిశాంతి నియామకం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పలువురు కలెక్టర్లకు బదిలీల నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు స్థానచలనం కల్పించి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) ఎండీగా ప్రభుత్వం నియమించింది. అలాగే బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న టి.నిశాంతికి పదోన్నతి కల్పించి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ పదోన్నతిపై అల్లూరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన టి.నిశాంతి ఉత్తమ ఐఏఎస్ అధికారిణిగా గుర్తింపు పొందారు. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూర్ జిల్లాకు చెందిన టి.నిశాంతి బీటెక్, ఎంబీఏ చేసి, 2017లో ఐఏఎస్ సాధించారు. ప్రకాశం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొంది పెనుగొండ సబ్ కలెక్టర్‌గా, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో జాయింట్ కలెక్టర్, రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాయింట్ సెక్రటరీగా చేసి 2024 జూలై 24న కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ధాన్యం సేకరణ సమయాల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడంతో రైతులకు చేరువయ్యారు. గోదావరి వరదల సమయాల్లో కీలకంగా వ్యవహరించారు. అక్కడ భూ సమస్యలు, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆమె ప్రత్యేక శద్ధ కనబరిచారనే గుర్తింపు ఉంది.

## మాదకద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్ధాలకు వ్యతిరేకంగా యువత గళమెత్తింది. మత్తును చిత్తు చేస్తామని ప్రతినబూనింది. మాదకద్రవ్య రహిత సమాజమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. వెరసి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్ధాలకు వ్యతిరేకంగా బీచ్ రోడ్డులో తలపెట్టిన 5కె రన్ ఆద్యంతం ఉత్సాహంగా.. ఉత్తేజంగా సాగింది. అందరిలో చైతన్యం రేకెత్తించింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, నేవీ ఆఫీసర్ సంజీవ్ ఈ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోజు రోజుకూ పెరుగుతున్న మాదకద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య డ్రగ్స్ మాఫియాకు బలయ్యారని, ఆయన స్ఫూర్తిని అందరిలోకి తీసుకువెళ్లడం కోసం డ్రగ్స్, గంజాయి వ్యతిరేక క్యాంపెయిన్ జరుగుతోందని అన్నారు. అందరూ డ్రగ్స్ ఫ్రీ విశాఖ లక్ష్యంగా కృషి చేయాలన్నారు. జిల్లాలో గంజాయి మాఫియాను అరికట్టాలన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్, గంజాయి మాఫియా విజంభిస్తోందని తెలిపారు. యువత వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. డ్రగ్స్ మాఫియా ఆగడాల వల్ల యువతులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. 'గంజాయి, మత్తు పదార్ధాలు లేని విశాఖను నిర్మించుకుందాం.. యువతరాన్ని కాపాడు కుందాం' అన్న నినాదంతో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పనిచేస్తాయని ఆయా సంఘాల నేతలు అన్నారు. కాలనీలలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, రేపటితరం బాగుండాలని, ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్న ఆలోచనతో 5కె రన్ నిర్వహించామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వల్ల ఆత్మగౌరవం ఉండదని, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడతాయని, అనారోగ్యం పాలవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజరు, వెంకటరమణ, నాయకులు కుసుమాంజలి, కౌశిక్, మౌనిక, నరేష్, సంజరు, భరత్, ప్రగతి, సంజు, సోమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, మహేష్, నాయకులు ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను కించపరిచే ఉద్దేశం లేదు



**కవిటి, పతాకం న్యూస్:** గిరిజనులను కించపర్చే ఉద్దేశం తనకు లేదని, ఇటీవల జరిగిన ఓ పరిణామంలో తాను అన్న మాటలను వెనక్కు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 26న గిరిజన నేతలు తన వద్దకు వచ్చి బెంతు ఒరియాలకు ఎస్టీ హోదా కల్పించ వద్దని కోరారన్నారు. జిల్లాలో ఉన్నవారంతా నకిలీ బెంతు ఒరియాలని వారు ప్రస్తావిం చడంతో ఆ సంఘ నేతలతో కలిసి సామరస్య పూర్వకంగా సమస్య ను పరిష్కరించుకోవాలని సూచించానన్నారు. ఈ తరుణంలో ఓవ్యక్తి మా ట్లాడే భాషకు స్పందించి మాట్లాడాను తప్ప ఎవరినీ తక్కువగా చేసే ఉద్దేశం తనకు లేదన్నారు. ఆ వ్యక్తితో మాట్లాడే విషయంతో తప్పు దొర్లిం దని, అందుకు తాను చింతిస్తున్నానన్నారు. తన మాటలను వెనక్కి తీసుకుంటున్నానని పేర్కొన్నా రు. సామాజిక వర్గాన్ని కించపర్చేలా మాట్లాడ లేదని చెప్పారు. గిరిజనులంతా కలిసి వచ్చి సమస్యను చెప్పే తరుణంలో వారి అభ్యర్థనలను పరి శీలించే విధంగా మాట్లాడానన్నారు. అయితే గిరిజనులతో కలిసి మాట్లాడే క్రమంలో జరిగిన విషయాలను పూర్తిగా చూడకుండా కొన్ని ఎడిట్ వీడియోలతో వైసీపీ నేతలు లబ్ధి పొందాలని సోషల్ మీడియా ద్వారా గందరగోళం సృష్టించా లనుకోవడం తగదన్నారు. నియోజకవర్గంలో ఉన్న బెంతు ఒరియాలకు మేలు చేయా ల్సింది పోయి మరింత ఇబ్బందికరంగా తయారయ్యేలా వైసీపీ నేతలు మారడం చూస్తుంటే ఆ కుల స్థులపై వారికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమౌతుం దన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్ ప్రదాన్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కె.శంకర్‌రెడ్డి, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు,నేతలు జీకే నాయుడు, ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా.. సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్: భూమన కరుణాకర్ రెడ్డి



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి, పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు. ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** గ్రామాల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్ కోరారు. మండలంలోని చిలకాం పంచాయతీ పరిధిలోగల దత్తివలసలో మత్తు పదా ర్థాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి ఆదేశాల మేరకు గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో మత్తు పదార్థాలు, సారా సేవించడం, తయారీపై అవగాహన కల్పిస్తున్నా మని తెలిపారు. మత్తుపదార్థాలు సేవించడంతో భవిష్యత్ అంధకారంగా తయారవుతుందన్నారు. గ్రామాల్లో అమ్మకాలు జరిగినా, రవాణా జరిగినా సమాచారంఅందించాలని కోరారు. సమాజాన్ని మత్తు నుంచి కాపాడే బాధ్య త యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదస్థాయికి చేరిన తాండవ రిజర్వాయర్




**విజయనగరం, పతాకం న్యూస్:** 12వ పిఆర్సి ప్రకటించి మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, థర్డ్ పార్టీ, విలీన ప్రాంత కార్మికులకు ఆప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని , మరణించిన రిటైర్ అయిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు , ఆప్కాస్ లో ఉద్యోగి అనే పదాన్ని తొలగించి పెన్షన్ మంజూరు చేయాలని, 17 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, ఎక్స్ గ్రేషియా పెంపు జీవోలు తక్షణమే ఇవ్వాలని పనిముట్లు రక్షణ పరికరాలు సమస్య పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్(సి ఐ టి యు) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు బి భాస్కరరావు, ఏ జగన్మోహన్ రావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుంది అని ఆశించామని, అందుకు భిన్నంగా కార్మికులపై పని భారం, వేధింపులు పెరుగుతున్నాయని, మరణించిన కార్మిక బిడ్డలకు ఉద్యోగాలను సైతం సంవత్సరాల తరబడి ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా , వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మా సేవలను గొప్పగా కొనియాడారు, ఆచరణలో సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినా అమలకు నోచుకోలేదని, చివరికి రిటైర్ అయిన కార్మికునికి ఎలాంటి ఆర్థిక సహకారం ప్రభుత్వం ఇవ్వకపోగా, ఆప్కాస్ లో ఉద్యోగి అని నమోదు కావడంతో వృద్ధాప్య, వితంతు పెన్షన్ కూడా రావడంలేదన్నారు. కుటుంబంలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. విజయనగరం కార్పొరేషన్ లో విలీన ప్రాంత కార్మికులకు రూ" 15000/-, పంప్ హౌస్, స్ట్రీట్ లైటు, లీకులు ,వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్, పార్కుల్లో సెక్యూరిటీ గార్డ్స్ తదితర థర్డ్ పార్టీ కార్మికులకు కేవలం 11000 నుంచి 13000/- లు జీతం ఇచ్చి వారి శ్రమను కొల్లగొడుతున్నారని, వీరందరికీ కనీసం ఆప్కాస్ కార్మికులతో సమానంగా 18500/- లు, 21000/- లు అమలు చేయాలని, ప్రభుత్వ, లేబర్ హాలిడేస్, సిక్, క్యాజువల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్ బంకులో తనిఖీలు



**నరసన్నపేట, పతాకం న్యూస్:** స్థానిక పాతబస్టాండ్‌లోగల ఒక పెట్రోల్ బంకును తూనికలు, కొలతలు శాఖ సహాయక కమిషనర్ చిన్నమ్మి తనిఖీ చేశారు. సంబంధిత పెట్రోల్ బంకులో కొలతలు తేడా ఉన్నాయంటూ పలువురు ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఈ మేరకు ఆమె స్పందించి పెట్రోల్ బంకులో తనికీ చేపట్టి, కొలతలను పరిశీలించారు. తాను పరిశీలించే సమయంలో ఎటువంటి తేడాలు కనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. సక్రమంగా కొలతలు నిర్వహించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## నత్తనడకన రైతు బజారు నిర్మాణ పనులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రం అనకాపల్లిలో రైతు బజారు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాస్తవానికి గత ఏడాది డిసెంబరు నెలాఖరులోనే రైతు బజారు అందుబాటులోకి రావలసి ఉన్నా ఇప్పటి వరకు ఓ కొలిక్కి రాలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 మార్చి నెలలో అనకాపల్లిలో రైతు బజారు మంజూరైనా దాని నిర్మాణంపై మాత్రం దృష్టి పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు ఏడు నెలల క్రితం రూ.14 లక్షల నిధులు విడుదల చేయడమే కాకుండా పనులను కూడా ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలు ఎన్టీఆర్ మార్కెట్‌యార్డును పరిశీలించి నాగదుర్గమ్మ ఆలయానికి ఆనుకొని నిరుపయోగంగా ఉన్న రెండు బ్లాక్‌లను గుర్తించారు. ఈ రెండు బ్లాక్‌ల్లో రైతుబజారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గతేడాది చివరలో రెండు బ్లాక్‌ల్లో రైతులకు అవసరమయ్యే సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు. వాస్తవానికి నిర్మాణ పనులు పూర్తయి డిసెంబరు నెలాఖరుకు రైతు బజారు అందుబాటులోకి రావాల్సి ఉంది. సంక్రాంతికి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు ప్రకటించినా ఉగాది దాటినా అందుబాటులోకి రాకపోవడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ రెండు బ్లాక్‌ల్లో రైతుల కోసం ప్లాట్‌ఫారాలను అధికారులు సిద్ధం చేశారు. డ్వాక్రా మహిళలకు 25, కూరగాయల రైతులకు 75 ప్లాట్‌ఫారాలను సిద్ధం చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఇప్పటి వరకు రైతులు వంద మంది వరకు రైతు బజారుకు వచ్చి కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు దరఖాస్తులు చేసుకున్నారని మార్కెటింగ్‌శాఖ ఏడీ అశోక్‌కుమార్ తెలిపారు. రైతు బజారు స్టాళ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ విద్యుద్దీకరణ పనులు జరగకపోవడంతో ప్రారంభానికి తీవ్ర జాప్యం జరుగుతోంది.

## ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ఆపాలి

**విజయనగరం, పతాకం న్యూస్:** విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలని సిఐటియు విజయనగరం జిల్లా కార్యదర్శి టీవీ రమణ అన్నారు. సోమవారం ఉదయం విజయనగరం డిపో వద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ యూనియన్ ఆఫీసులో విద్యుత్ బస్సుల సాకుతో జరిగే ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి. విద్యుత్ బస్సులు ఆర్టీసీని పెంచడానికి కాదు ముంచడానికే అనే బుక్ లెట్ ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శ టివి రమణ ఆవిష్కరణ చేసిరి.ఈ సందర్భంగా టీవీ రమణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ధార దత్తం చేస్తున్నారన్నారు, అందులో భాగంగా ఆర్టీసీని విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణం చేస్తున్నారని ఈ విషయాన్ని బుక్లెట్ ద్వారా కార్మికులకు, ప్రజలకు తెలియజేయడం అభినందనీయమైనదని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఈ బుక్లెట్ ని చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. వెంకట్రావు, వి. రాములు అలాగే డిపో అధ్యక్షులు ఎస్ కె. రఫీ, డిపో ప్రచార కార్యదర్శి జె ఎస్ నారాయణ, డిపో సభ్యులు ఎస్ బి.నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూతపడుతున్న హోటళ్లు!



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ఇచ్ఛాపురంలో సుమారు 50 హోటళ్లు ఉన్నాయి. అందులో 40 హోటళ్లు మూతపడ్డాయి. ప్రస్తుతం 10 హోటళ్లు మాత్రమే నిర్వహిస్తున్నారు. కొందరు కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్నారు. మరికొందరు వారికి ఉన్న పరపతితో కమర్షియల్ గ్యాస్ సిలెండర్లు అటు ఒడిశా నుంచి తెప్పించుకొని హోటళ్లు నడిపిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా జిల్లాలో చాలా హోటళ్లు మూతపడ్డాయి. అందులో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. మార్కెట్‌లో కొన్ని హోటళ్లను మాత్రమే కష్టమ్మీద కొనసాగిస్తున్నారు. ఈ నెల 14 వరకూ వాణిజ్య సిలెండర్లు బాగానే సరఫరా చేశారు. కానీ తర్వాత పూర్తిగా నిలిపివేశారు. కేవలం ఆస్పత్రులు, వసతిగృహాలు, విద్యాసంస్థలకు మాత్రమే గ్యాస్ సరఫరా చేస్తున్నారు. ఫలితంగా హోటళ్ల నిర్వహణ కష్టతరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 500 వరకూ హోటళ్లు, రెస్టారెంట్లు ఉంటాయి. వాటి ద్వారా దాదాపు 10వేల మంది ఉపాధి పొందుతున్నారు. గ్యాస్ కొరతతో కారణంగా జిల్లాలో సగానికిపైగా హోటళ్లు మూతపడడంతో వారంతా ఉపాధికి దూరమైనట్టే. ఒక వేళ కట్టెల పొయ్యి మీద వంటలు చేద్దామన్నా వంట చెరకు లభ్యత లేదు. అందుబాటులో ఉన్న వంటచెరకు ధర భారీగా ఉంది. అందుకే హోటళ్లు నడిపిస్తే తమకు ఇబ్బందులు తప్పవని యజమానులు చెబుతున్నారు. సాధారణ పరిస్థితులు వచ్చేవరకూ హోటళ్లు నడిపే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వివాహాలు, శుభకార్యాలు జరుగుతున్నాయి. వాటికి సైతం గ్యాస్ కొరత వెంటాడుతోంది. కొందరు ముందుగానే క్యాటరింగ్ చెప్పుకున్నారు. ఇప్పుడు గ్యాస్ లభ్యత లేకపోవడంతో వంటల నిర్వాహకులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. కొంతమంది పెళ్లిళ్లకు ఇళ్ల వద్ద కట్టెలతో వంటలు చేస్తున్నారు. కొరత నేపథ్యంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి గ్యాస్ సిలిండర్ల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## అన్నదాతలను మోసం చేస్తే కఠిన చర్యలు: నాదెండ్ల




**నెల్లూరు, పతాకం న్యూస్:** జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన విజయవంతంగా సాగుతోంది. కోవూరు మండలం ఇనమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి.. అనంతరం గూడూరు మండలం పేడూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పేడూరు ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలోని వ్యవసాయ రైతుల సదస్సుకు మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పలు అంశాలపై వారికి భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో కేంద్రాలను రైతులకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్నదాతలు, ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు వారధి వంటి వారని.. రైతును దోపిడీ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.తూకాల్లో ఎక్కువ ధాన్యం తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. అన్నదాతలను దోపిడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల చెప్పారు. న్యాయబద్ధంగా పారదర్శకంగా రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఉంటే వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలని, అధికారులకూ చెప్పాలని రైతన్నలకు మంత్రి సూచించారు. సమస్యలను బాధ్యతగా తీసుకుని తొలగిస్తామని.. మీ సమస్యలు తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. జాతీయ ఉపాధి పథకం కింద గ్రామాల్లో ధాన్యం కల్లాలు ఏర్పాటు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

## మొక్కజొన్న కొనేందుకు ముందుకు రాని మార్క్‌ఫెడ్



**అమరావతి, పతాకం న్యూస్:** మొక్కజొన్న కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ముందుకు రావడం లేదు. కేంద్రానికి లేఖ రాసి మమ అనిపించడం మినహా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతుల్లో గుబులు మొదలైంది. దక్కిన పంట వర్షాలకు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేసి, తక్కువ ధరకు దోచుకుంటున్నారు. దీంతో, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే నష్ట తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 సంవత్సరంలో 12,07,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. 37.61 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విజయనగరం జిల్లాలో సాధారణ విస్తీర్ణం 52,815 ఎకరాలు కాగా, ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1,13,975 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు అనుకూలించడం, చెరువుల్లో నీరు, భూగర్భజలాలు ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నసాగుపై ఈ ఏడాది మక్కువ చూపారు. అదే స్థాయిలో పెట్టుబడి ఖర్చు కూడా పెరిగింది. పురుగు మందులు, ఎరువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా యూరియా కొరత వల్ల రైతులు రూ.270 ఖరీదు గల యూరియా బస్తా రూ.600 నుంచి రూ.650 చొప్పున కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. వాతావరణం సహకరించడంతో ఈ ఏడాది ఎకరాకు 30 క్వింటాల నుంచి 35 క్వింటాల వరకు దిగుబడి కనిపిస్తున్నా మద్దతు ధర మాత్రం అత్తెసరుగానే ప్రభుత్వం ప్రకటించింది. ఒక క్వింటాలుకు రూ.2,400 చొప్పున నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసేందుకు కూడా ప్రభుత్వం ముందుకు రాలేదు. ఇప్పటికే జిల్లాలో 25 శాతం కోతలు పూర్తయినా జిల్లాలో ఒక్కటంటే ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ఒక క్వింటాలును రూ.1500 నుంచి రూ.1700లోపే కొనుగోలు చేస్తున్నారు. ఓవైపు ప్రభుత్వం నుంచి కొనుగోలు భరోసా లేకపోవడం, మరోవైపు పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చేందుకు గడువు ముగియడంతో వ్యాపారుల వలలో అనివార్యంగా చిక్కుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. అపరాల కొనుగోలుకు కూడా ప్రభుత్వం సహకరించకపోవడంతో దళారులకు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సి వచ్చిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు ఆందోళన చేపట్టారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం




**బొబ్బిలి, పతాకం న్యూస్:** లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీవో రామ్మోహనరావు అన్నారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టం అమలు తీరుపై వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుష సంతాన ప్రాధాన్యం, ఆడపిల్లలపై వివక్ష, మూఢనమ్మకాలు తదితర వాటి నేపథ్యంలో గర్భస్థ శిశువు ఆడ అని తేలితే గర్భ స్రావాలు చేయించుకోవడం నేరమన్నారు. 0-6 సంవత్సరాల బాలికల లింగ నిష్పత్తిని పెంచ డానికి ప్రభుత్వం లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తోందన్నారు. ఈ చట్టం ద్వారా లింగ నిర్ధారిత ఆడ శిశువుల భ్రూణ హత్యలను నిరోధించేందుకు ఈ చట్టం అత్యధిక ప్రాధాన్యమి స్తోందన్నారు. చట్టం అమలును ప్రతీ ఒక్కరూ ఓ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారిత పరీక్షల కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సంతోషికుమారి, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ సంధ్య, సీఐ కింతలి నారాయణరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బలక్ష్మి, ఎన్‌జీవో శాంతి, చిన్నతల్లి, హెచ్‌ఈ చాముండేశ్వరి పవన్ ఆశిష్ పాల్గొన్నారు.

## మెగా ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** కొట్టాల గ్రామంలో కలికిరి మార్కెట్ యార్డ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టమోటా మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, డైరెక్టర్లు శ్రీనివాస్ వర్మ, రాంబాబు ఆధ్వర్యంలో పత్తేగడ పంచాయతీ కొట్టాల గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశు వైద్య ఉపసంచాలకులు డాక్టర్ వెంకట మునినాయుడు పాల్గొని పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువుల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించుకోవాలని, పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులందరూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరికుంటపల్లి సర్పంచ్ రెడ్డి రాము, గ్రామ నాయకులు చల్లయ్య, మునిసల్లయ్య, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# రబీ సీజన్‌లో కానరాని కొనుగోలు కేంద్రాలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రబీలో పండించిన ధాన్యం నిల్వలు కళ్లాల్లో పేరుకుపోతున్నాయి. చాలాచోట్ల ధాన్యం విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఇంతవరకూ అనుమతులు రాలేదు. మరోవైపు వాతావరణం మార్పులతో ధాన్యం నిల్వ చేసేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారీలు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలోని జలుమూరు, నరసన్నపేట, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, పాతపట్నం తదితర మండలాల్లో సుమారు సుమారు 20వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. చాలాచోట్ల కోతలు పూర్తయి.. ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెడుతున్నారు. సుమారు 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని ప్రాథమిక అంచనా. కాగా.. ప్రభుత్వం రబీసీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌జీఎల్, షుగర్‌లెస్ వంటి సన్నాలు రకాల బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. 80 కేజీల ధాన్యం బస్తా రూ.2,300కు కొనుగోలు చేయాల్సి ఉండగా.. దళారీలు సిండికేట్‌గా వ్యవహరించి.. సుమారు రూ.1,900కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు పొల్లు, మట్టి పేరిట బస్తాకు రెండు నుంచి మూడు కేజీల మార్జిన్ తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాల కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రబీ సీజన్‌లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు.

జిల్లాలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మండపేట, సామర్లకోట తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. రోజూ సుమారు పది లారీల ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. 80 కేజీల సన్నరకాల ధాన్యం బస్తాను రూ.1,900 కొనుగోలు చేస్తున్నారు. ఆ ధాన్యం మరపడితే 60 కేజీల బియ్యం దిగుబడి వస్తుంది. ఆ బియ్యాన్ని బస్తాల్లో ప్యాకింగ్ చేసి.. కిలో రూ.65 చొప్పున 3,900కు విక్రయిస్తున్నారు. అంటే బస్తా ధాన్యం వద్ద రెట్టింపు లాభాన్ని దళారీలు పొందుతున్నారు.

# పిఎంఎవై ఇళ్లకు యూనిట్ కాస్ట్ పెంచిన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపిన కేంద్రం

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడేలా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం పెంచి, ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మంజూరు చేయనున్న పిఎంఎవై గ్రామీణ్ 2.0 గృహాలకు దీన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 16న జిఒఆర్‌టి నంబరు 20 ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధుల్లో ఒక పక్క కోత విధిస్తోన్న కేంద్ర ప్రభుత్వం... మరోవైపు కేంద్ర ప్రయోజిత పథకాల ఖర్చును రాష్ట్రాపై నెట్టేస్తోంది. రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం మోపేలా కేంద్రం నిర్ణయం తీసుకుంటున్నా టిడిపి కూటమి ప్రభుత్వం నోరుమెదక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిఎంఎవై గ్రామీణ్ 2.0 గృహ పథకానికి అర్హుల గుర్తింపు దాదాపు కొలిక్కి వచ్చింది. ఆవాస్ ప్లస్ సర్వే పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని కుటుంబాలకు సంబంధించి గతేడాది నవంబరులో ఇంటింటా సర్వే నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,42,199 దరఖాస్తులు వచ్చాయి. 9,20,764 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 1,21,435 కుటుంబాల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారి పేరుతో ఇళ్లు ఉండడం, ఆధార్ నంబర్లు సరిపోల్చకపోవడం వంటి కారణాలతో మరోసారి వారి వివరాలను మండల స్థాయిలో ఎంపిడిఒలు తనిఖీ చేస్తున్నారు. పిఎంఎవై గ్రామీణ్ 2.0 కింద గుర్తించిన లబ్ధిదారులకు రానున్న కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇళ్లు మంజూరు చేయనున్నారు.

పిఎంఎవై గ్రామీణ్ 2.0 కింద ఎంపికైన లబ్ధిదారులకు అందించనున్న సాయంపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు మార్గదర్శకాలను వెలువరించింది. ఒక్కో లబ్ధిదారునికీ రూ.2.39 లక్షల సాయం అందించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం యూనిట్ ఖరీదు రూ.1.59 లక్షలు ఉంది. అందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.95,400. జాతీయ



గ్రామీణ ఉపాధి చట్టం కింద గృహ నిర్మాణ పనులు చేసుకునేందుకు 90 రోజుల పనిదినాలకు రూ.16,200, వ్యక్తిగత మరుగుదొడ్లకు రూ.7,200 చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లిస్తున్న రూ.63,600లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రూ.10,800, వ్యక్తిగత మరుగుదొడ్లకు రూ.4,800 అందిస్తోంది. ఇప్పుడు తాజాగా పెంచిన రూ.2.39 లక్షలతో అదనంగా పడనున్న రూ.80 వేలను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. తనపై పడిన భారాన్ని రాష్ట్రం ప్రభుత్వం మూడు శాతం అప్పు కింద లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించింది.

# ఆశాజనకంగా చింతపండు ధర.. ఆనందంలో గిరిజనులు

**సీతంపేట, పతాకం న్యూస్:** సీతంపేట ఏజెన్సీలో ఈఏడాది చింతపండు ధర ఆశాజనకంగా ఉంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఒక్కో కేజీకి రూ.40వరకు అదనంగా ధర పలకడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో చింతపండు ఒక్కో కేటు(20కేజీల)ధర రూ.1600వరకు పలుకుతోంది. అదే బ్లాక్‌మార్కెట్‌లో అయితే కేజీ చింతపండు ధర ఏకంగా రూ.100వరకు పలుకుతోంది. గత ఏడాది కంటే ఈఏడాది చింతపండుకు ధర పెరిగినప్పటికీ పంట తగ్గిపోవడంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సీతంపేట, కొత్తూరు, భామిని, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం వంటి మండలాల్లో చింతపండు ఎక్కువగా పండుతోంది. ఈ ప్రాంతంలో గిరిజనులు సేకరించే చింతపండు నాణ్యతగా ఉండడంతో మైదాన ప్రాంతాల్లో ఈ పంటకు ఎక్కువ గిరాకీ ఉంది. అయితే ఏటా గిట్టుబాటు ధర మాత్రం అంతంత మాత్రంగానే ఉండేది. కానీ ఈఏడాది మాత్రం పరిస్థితి మారింది. గిరిజన రైతులు ఊహించని ధర పలుకుతోంది. దీంతో వారు చింతపండు సేకరించే పనిలో పడ్డారు. సీతంపేట మన్యంలో ఏటా 80 టన్నుల వరకు చింతపండు దిగుమతి అయ్యేది. అయితే ఈఏడాది దిగుబడి తగ్గింది. సుమారు 60టన్నుల వరకే పంట వచ్చే అవకాశం ఉందని గిరిజన రైతులు భావిస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో పొల్ల, టిటుకుపాయి, మానాపురం, చింతాడ, పూతికవలస, మర్రిపాడు, చిన్నబగ్గ, జైపురం, దోనుబాయి, శంభాం, కడగండి, ఓంద్రుజోల, రేగుమానుగూడ, అంటికొండ, పెద్దగూడ, తుంబలి, కిండంగి, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదారగూడ, రుక్మిణిగూడ గ్రామాల నుంచి సమీపంలో ఉన్న వారపుసంతలకు చింతపండు దిగుమతి అవుతోంది. అయితే ఏటా దిగుమతికి తగ్గట్టుగా మద్దతు ధర రాకపోవడంతో గిరిజన రైతులు ఈ పంటపై ఆసక్తి చూపడం లేదు. దీంతో కాలక్రమేణా దిగుబడి తగ్గుముఖం పడుతూ వస్తోంది. మరోవైపు ఏటా తుఫాన్ల ప్రభావానికి ముదిరిపోయిన చింతచెట్లు నేలకొరుగుతున్నాయి. వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటకపోవడంతో పంట తగ్గుముఖం పడుతోంది. అంతేకాకుండా గిరిజన రైతులు పోడు వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. దీనిలో భాగంగా కొండపై ఉన్న చింతచెట్లను తొలగిస్తుండడంతో ఏజెన్సీలో పంట దిగుబడి చాలా వరకు తగ్గిపోయింది.



ఈఏడాది సీతంపేట, పాతపట్నం బ్రాంచ్‌ల పరిధిలో 1200టన్నుల చింతపండు కొనుగోలు చేయాలని జీసీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొద్ది రోజుల కిందట గిరిజన సహకార సంస్థ చింతపండు ధర పెంచింది. గత ఏడాది కిలో ధర రూ.36 ఉండగా ఈఏడాది రూ.9 పెంచి కేజీ రూ.45గా ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో గిరిజన ఉత్పత్తులకు ఉన్న ధరలతో పోల్చుకుంటే జీసీసీ ప్రకటించిన ధరలు తక్కువగానే ఉంటున్నాయి. దీంతో అటవీ ఉత్పత్తులను జీసీసీకి విక్రయించేందుకు గిరిజనులు ముందుకు రావడం లేదు. ఈఏడాది సీతంపేట ఏజెన్సీలోని వారపుసంతల్లో చింతపండు నాణ్యతను బట్టీ కేజీ ధర రూ.80 నుంచిరూ.90 వరకు పలుకుతోంది. ఈ ధరకే గిరిజనుల నుంచి మైదాన ప్రాంతవాసులు చింతపండును కొనుగోలు చేసుకుని మార్కెట్‌లో కేజీ రూ.100వరకు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో వారపుసంతల్లో జీసీసీ కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

## ఏప్రిల్ 1న బ్లాక్ డేగా పాటిద్దాం



**కాకినాడ, పతాకం న్యూస్:** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను నిరసిస్తూ ఏప్రిల్ 1న రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డేగా జరపాలని కేంద్ర కార్మిక సంఘాలు కార్మికలోకానికి పిలుపునిచ్చాయి. స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షత వహించగా, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.శేషబాబ్జి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి నాయకులు తాళ్లూరి రాజు, ఎఐఎఫ్‌టియు నాయకులు ఆర్ సతీష్ తదితరులు మాట్లాడారు. ఏప్రియల్ ఒకటిన కలెక్టరేట్ వద్ద నిర్వహించే బ్లాక్ డే కార్యక్రమంలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల, డివిజన్ కేంద్రాల్లోనూ, ఇతర పారిశ్రామిక ప్రాంతాలలోనూ, ఉద్యోగస్థలాలలోనూ నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలు పట్టుకొని నిరసనలు తెలియజేయాలని, లంచ్ అవర్ ప్రొటెస్టులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నగర నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, ఎఐఎఫ్‌టియు నాయకులు మడికి సత్యం, ఐఎఫ్‌టియు నాయకులు బంగారు సత్యనారాయణ, కొప్పనాతి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం



**నరసాపురం, పతాకం న్యూస్:** నరసాపురం మండలం రుస్తుంబాద మంగళ గుంట పాలెంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయణ నాయకర్, టీడీపీ నియోజకవర్గ పొత్తూరి రామరాజు వైభవంగా ప్రారంభించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ భవనాన్ని 7 లక్షల జడ్పీనిధులతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని, చిన్నారులకు పౌష్టికాహారం మరియు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

## 'గోల్డ్ మ్యాన్' కాదు 'రోల్డ్ గోల్డ్ మ్యాన్'



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ పాతబస్తీలో 'గోల్డ్ మ్యాన్'గా ప్రసిద్ధి చెందిన సూర్యా భాయ్ బండారం బట్టబయలైంది. కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరించి తిరుగుతూ సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వాస్తవానికి నకిలీ నగలు ధరిస్తున్నాడని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ విచారణలో తేలింది. దీంతో అత్తాపూర్‌కు చెందిన పల్లపు సురేశ్ కుమార్ అలియాస్ సూర్యా భాయ్ ఇమేజ్ ఒక్కసారిగా తలకిందులైంది. అసలు ఈ విషయం ఎలా బయటపడిందంటే... కొండా విజయ్ కుమార్ అనే వ్యక్తిపై జరుగుతున్న ఐటీ విచారణలో భాగంగా సూర్యా భాయ్ పేరు వెలుగులోకి వచ్చింది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ విమానాశ్రయంలో విజయ్ కుమార్ నుంచి అధికారులు 1.4 కిలోల అసలైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించినప్పుడు సూర్యా భాయ్‌ను గుర్తించి విచారణ చేపట్టారు. ఐటీ అధికారుల ఎదుట హాజరైన సూర్యా భాయ్, తాను ధరించిన 12 ఆభరణాల విలువ సుమారు రూ.1 కోటి అని మొదట చెప్పారు. అయితే, అధికారుల ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానం బలపడింది. చివరికి ఆ నగలు రాగితో చేసి రోడియం పూత వేసినవని, వాటి విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని అంగీకరించారు. ఒక్క ఆభరణం మాత్రమే వెండిపై బంగారు పూత వేసిందని తేలింది. యూట్యూబ్ ఇంటర్వ్యూలు, సోషల్ మీడియాలో ధనవంతుడిగా కనిపించేందుకు సూర్యా భాయ్ సుమారు 32 రకాల నకిలీ ఆభరణాలను వాడినట్లు విచారణలో వెల్లడైంది. రంగు మారినప్పుడల్లా వాటిని మార్చేవాడని తెలిసింది. ఈ ఘటనతో పాతబస్తీలో 'గోల్డ్ మ్యాన్' కాస్తా 'రోల్డ్ గోల్డ్ మ్యాన్' అయ్యాడంటూ స్థానికులు, నెటిజన్లు ఎగతాళి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ లోతుగా దర్యాప్తు చేస్తోంది. లోతైన విచారణలో సూర్యా భాయ్ ఆర్థిక పరిస్థితి గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతనికి సొంత ఇల్లు లేదని, రూ.20 వేల అద్దె ఇంట్లో నివసిస్తున్నాడని తేలింది. గత ఆరేళ్లుగా ఐటీ రిటర్నులు దాఖలు చేయని అతను, కేవలం 2022-23లో రూ.4.9 లక్షల ఆదాయం చూపాడు. థార్, సఫారీ వంటి వాహనాలు ఉన్నప్పటికీ, అవి కేవలం ప్రదర్శన కోసమేనని, భూవివాదాల సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన కమీషన్లతో కొన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రజల్లో గుర్తింపు, సినిమా అవకాశాలు పొందాలనే ఉద్దేశంతోనే ఇలా 'గోల్డ్ మ్యాన్'గా ప్రచారం చేసుకున్నానని విచారణలో సూర్యా భాయ్ అంగీకరించినట్లు తెలిసింది. తాను 'గటికుడు' అనే సినిమాలో చిన్న పాత్రలో నటించానని కూడా చెప్పాడు. విచారణ అనంతరం అతడిని విడిచిపెట్టినప్పటికీ, ప్రధాన సూత్రధారి అయిన విజయ్ కుమార్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఐటీ అధికారులు స్పష్టం చేశారు.

## మొక్కల చెరువు భూసేకరణ నిలుపుదల చేయాలి



**నగిరి, పతాకం న్యూస్:** నగిరి మండలం మొక్కల చెరువు గ్రామంలో ప్రాజెక్టు పేరుతో 230 ఎకరాలు రైతులు అభిప్రాయాలు తీసుకోకుండా భూసేకరణకు సర్వే చేయడం ఏమిటని సోమవారం కలెక్టరేట్ వద్ద మొక్కల చెరువు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు రైతులకు మద్దతుగా మాట్లాడుతూ గ్రామములో రైతులతో సమావేశాలు జరిపి రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా రైతులు సాగు చేసుకుంటున్నా భూములలో సర్వే చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా భూహక్కులు ఉన్నప్పటికీ రైతులు సంప్రదించకుండా ఎలా సర్వే చేసి హద్దులు పెడతారని ప్రశ్నించారు. అన్ని రకాలుగా పంటలు పండుతున్న భూములను ప్రాజెక్టు పేరుతో తీసుకోవడం సరైన కాదన్నారు. జీవనాధారం ఉన్న భూమిని తీసుకోవాలనుకోవడం దారుణం అన్నారు. జిల్లాలో పారిశ్రామికంగా ఇతర అవసరాలకు ప్రభుత్వం రైతుల నుండి భూములు సేకరిస్తున్నప్పటికీ వారికి సరైన పరిహారం ఇవ్వకుండా తీసుకుంటున్న పరిస్థితి ఉంది.2013 భూ సేకరణ చట్ట ప్రకారం అన్ని రకాలుగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీడి నెల్లూరు, నగరి, బంగారపాలెం, పలమనేరు తదితరచోట్ల పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు తీసుకుని ఏపీఐఐసీకి అప్పగించారు. పరిశ్రమలు రాలేదు కానీ భూములు మాత్రం ఖాళీగా ఉన్నాయి. ఐదు సంవత్సరాలు లోపు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే తిరిగి రైతులకు భూములు ఇవ్వాలని చట్టం చెబుతున్నప్పటికీ సంవత్సరాలకు ఉంది ఖాళీగా పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా నగరి మండలంలోని మొక్కల చెరువు గ్రామంలో భూములు సేకరణ వెంటనే నిలుపుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులను కలుపుకుని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## నామినేషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్

**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీవీకే అధ్యక్షుడు విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వరుసగా మూడుసార్లు కొళత్తూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయన ఈసారి కూడా అక్కడి నుంచే బరిలోకి దిగుతున్నారు. నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఢిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోందని అన్నారు. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నామని కార్యకర్తలను, అభిమానులను ఉద్దేశించి అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు.

# స్మార్ట్‌ఫోన్ అతిగా వాడితే మానసిక సమస్యలు, రేడియేషన్ ప్రభావం: డాక్టర్ శ్రీనివాస్



- ఫోన్ చిన్నపిల్లల మెదడును చిదిమేస్తుంది.
- ఫోన్ చిన్న పిల్లలు నత్తి నత్తిగా మాటలు ఆడేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- ఫోన్ చిన్నపిల్లల వయసులో కంటి అద్దాలకు దారి తీస్తుంది.
- ఫోన్ చిన్నపిల్లలకు మతిమరుపు రావడానికి బీటలు వేస్తుంది.
- ఫోన్ హార్మోన్స్‌పై ప్రభావం చూపుతుంది.
- ఫోన్ విటమిన్ లోపానికి దారితీయటమే కాకుండా న్యూరో ప్రాబ్లమ్స్ రావడానికి, నరాల మీద ప్రభావం పడుతుంది. దీనిములంగా తిమ్మిర్లకు దారి తీస్తుంది

**-డాక్టర్ శ్రీనివాస్ లెక్కల**
ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు



నేటి కాలంలో స్మార్ట్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగమైపోయింది. అయితే, దీని అతిగా వాడటం వల్ల కలిగే మానసిక సమస్యలు మరియు రేడియేషన్ ప్రభావంపై డాక్టర్ శ్రీనివాస్ లెక్కల ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలు మరియు టీనేజ్ పిల్లల విషయంలో స్మార్ట్ ఫోన్ వాడకం అనేది చాలా సున్నితమైన మరియు ముఖ్యమైన విషయం ఈ వయసులో మెదడు ఎదుగుదల చాలా వేగంగా ఉంటుంది. ఫోన్ స్క్రీన్లు ఆ ఎదుగుదలను దెబ్బతీస్తాయి. ఫోన్లతో గడిపే పిల్లల్లో మాటలు రావడం ఆలస్యం అవుతుంది (Speech Delay). వారు ఇతరులతో మాట్లాడటం కంటే స్క్రీన్‌తో సంభాషించడానికే ఇష్టపడతారు. రాత్రిపూట ఫోన్ వాడటం వల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి, చిరాకు మరియు కోపం పెరుగుతాయి. రాత్రి 9 తర్వాత ఫోన్లను "కామన్ ఏరియా"లో పెట్టే నిబంధన పెట్టండి

**1. మానసిక సమస్యలు** (Mental Health Issues) కుటుంబ సభ్యులందరూ స్మార్ట్ ఫోన్‌కు బానిసవ్వడం వల్ల ఈ క్రింది సమస్యలు తలెత్తుతాయి:

ఒంటరితనం (Social Isolation): ఒకే ఇంట్లో ఉన్నా, అందరూ ఫోన్లలో మునిగి పోయి ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం వల్ల బంధాల మధ్య దూరం పెరుగుతుంది.

ఆందోళన మరియు కుంగుబాటు (Anxiety & Depression): సోషల్ మీడియాలో ఇతరుల జీవితాలతో పోల్చుకోవడం వల్ల అసంతృప్తి, మానసిక ఒత్తిడి పెరుగుతాయి.

నిద్రలేమి (Insomnia): ఫోన్ నుండి వచ్చే 'బ్లూ లైట్' మెదడులోని మెలటోనిన్ హార్మోన్‌ను దెబ్బతీస్తుంది, దీనివల్ల నిద్ర కరువవుతుంది.

ఏకాగ్రత తగ్గడం: అతిగా ఫోన్ వాడటం వల్ల పిల్లల్లో చదువుపై, పెద్దల్లో పనిపై శ్రద్ధ తగ్గుతుంది.

**2. రేడియేషన్ ప్రభావం** (Radiation Effects) స్మార్ట్ ఫోన్ల నుండి వచ్చే నాన్-అయోనైజింగ్ రేడియేషన్ వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది:

మెదడుపై ప్రభావం: ఎక్కువ సేపు ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడటం వల్ల తలనొప్పి, తల తిరగడం వంటివి సంభవించవచ్చు.

కంటి చూపు: నిరంతరం స్క్రీన్‌ను చూడటం వల్ల 'డిజిటల్ ఐ స్ట్రెయిన్' (కళ్లు పొడిబారడం, మంటలు) వస్తుంది. దీని మూలంగా కంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి చిన్నపిల్లలు ఇప్పటికే కళ్లజోడు అద్దాలు పేరగటానికి కారణం ఇది ఒకటి చెప్పొచ్చు..

శారీరక నొప్పులు : ఫోన్ వంగి చూడటం వల్ల మెడ నొప్పి మరియు చేతి వేళ్ల నొప్పులు విపరీతంగా వస్తాయి.

ముఖ్య గమనిక : చిన్న పిల్లలకు రెండేళ్ల వరకు స్మార్ట్ ఫోన్ అస్సలు ఇవ్వకూడదు. టీనేజ్ పిల్లల ఫోన్ వాడకంపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి.

నిఘా ఉంచేటప్పుడు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం. పిల్లల ఫోన్లను దొంగతనంగా చెక్ చేయడం కంటే, వారితో కలిసి కూర్చుని "మనం ఈ రోజు ఫోన్‌లో ఏం చూశాం?" అని అడగడం వల్ల వారిలో దాపరికం తగ్గుతుంది. భయం కంటే బాధ్యతను నేర్పించడం ఉత్తమం.

# పద్మాపురం గార్డెన్ సౌకర్యాలపై పర్యాటకుల అసంతృప్తి





**అరకులోయ, పతాకం న్యూస్:** ప్రముఖ పర్యాటక కేంద్రం పద్మాపురం గార్డెన్‌లో అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఇంకా అసంపూర్తి నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి 9 గంటల వరకు పర్యాటకుల సందర్శనకు అనుమతి ఇచ్చేందుకు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ లక్ష్యం నెరవేరలేదు. ఎప్పటిలాగానే సాయంత్రం 5 గంటలకు గార్డెన్‌ను మూసివేస్తున్నారు. దీంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా పద్మాపురం గార్డెన్‌ను తీర్చిదిద్దాలని గత ఏడాది అప్పటి ఐటీడీఏ పీవో అభిషేక్ రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆ సమయంలో గార్డెన్‌ను మూసివేశారు. అయితే పనులు పూర్తికాకపోయినా గత ఏడాది అరకు ఉత్సవ్ కోసం గార్డెన్‌ను పునఃప్రారంభించారు. ఆ తరువాత అభిషేక్ బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి పనులు పడకేశాయి. వాస్తవానికి గార్డెన్ అంతటా పాత్‌వేకు, వృక్షాలకు రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. బేంబూ ట్రీల మధ్య ఉడెన్ బ్రిడ్జి నిర్మించారు. ఎరుపు రంగులో సినిమా సెట్టింగ్‌ను తలపించేలా పలు రకాల ఆకృతులను ఏర్పాటు చేశారు. అయితే వాటికి ఇప్పటికీ విద్యుద్దీప అలంకరణ చేయలేదు. అలాగే త్రీడీ లైటింగ్‌లో పలు రకాల జంతువుల ప్రతిమలను ఏర్పాటు చేశారు. కాగా వాటర్ ఫౌంటైన్ నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. పాత్‌వేలకు టైల్స్‌ను సక్రమంగా అమర్చలేదు. టాయ్‌ట్రైన్ మూలకు చేరినా వినియోగంలోకి తీసుకురాలేదు. హాట్ ఎయిర్ బెలూన్ ఎగరడానికి అనుకూలంగా బలమైన గాలులు వీచే సమయంలో గార్డెన్‌ను మూసివేస్తున్నారని, దీని వలన నష్టపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. అలాగే రోజ్ గార్డెన్‌లో బటర్‌ఫ్లై ఆకారాన్ని అరకొరగా నిర్మించి వదిలేశారు. ఇలా చాలా అసంపూర్తి పనులు దర్శనమిస్తున్నాయి. ఐటీడీఏ పీవో శ్రీపూజ స్పందించి ఈ అభివృద్ధి పనులు పూర్తి చేయించి రాత్రి 9 గంటల వరకు గార్డెన్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.


# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు




**ప్రకాశం, పతాకం న్యూస్:** మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుకు నిరసన తెలియజేసారు. ఈ నిరసనలో పాల్గొన్న సిఐటియు మార్కాపురం జిల్లా అధ్యక్షులు టి. ఆవులయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి ఏడేళ్లు గడుస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నా, కార్మికులకు మాత్రం చాలీచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 11వ పిఆర్‌సి గడువు ముగిసి రెండున్నరేళ్లు దాటినా, 12వ పిఆర్‌సి ఏర్పాటులో గత వైసిపి మరియు ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో జరిగిన 17 రోజుల సమ్మె ఒప్పందాలకు సంబంధించి 23 నెలలు గడచినప్పటికీ ప్రభుత్వం జీవోలు జారీ చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. 60 ఏళ్లు నిండిన కార్మికులను రిటైర్మెంట్ చేస్తున్నారు కానీ, వారికి రావాల్సిన గ్రాట్యుటీ లేదా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఒక్క నయా పైసా కూడా చెల్లించడం లేదని విమర్శించారు. అలాగే మున్సిపల్ కార్మికుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేసారు. కొత్తవారిని డైలీ వేజ్, ఎం-బుక్ పేరుతో తక్కువ జీతాలకు నియమించుకుంటూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. దశాబ్దాల తరబడి సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వధిక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని ఆవులయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి. నర్సింహులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. మురళి, కె. బాలయ్య, పాపయ్య, పి. రవి, డి. తామస్ తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.




# వరుణ్ చక్రవర్తికి పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు: క్రిష్ శ్రీకాంత్



టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత కొంత కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 ఆదిలో అద్భుతంగా బౌలింగ్ వేసిన వరుణ్.. క్రమంగా గతి తప్పి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఐపీఎల్‌లోనూ అదే రీతి కొనసాగుతోంది. కేకేఆర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడు.. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 48 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిపై టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ‘బంతిని విభిన్నంగా వేయడం, లెగ్ స్పిన్ సంధించడాన్ని నేర్చుకోనంత వరకు వరుణ్ చక్రవర్తి ఇబ్బందిపడుతూనే ఉంటాడు. ఎప్పుడూ గూగ్లీలు వేయడం వర్కౌట్ అవ్వదు. బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించాలి. కొన్నిసార్లు లెగ్ స్పిన్ వేయాలి. ఇప్పుడైతే అతడి బౌలింగ్‌లో ఎలాంటి మిస్టరీ లేదు. అదంతా హిస్టరీగా మారిపోయింది. బ్యాటర్లకు కాస్త దూరంగా బంతిని విసరాలి. అప్పుడు షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు ఇస్తారు. దీంతో తర్వాత వచ్చే బ్యాటర్లు కాస్త జంకుతారు. ఇక్కడ ఆయా జట్ల సారథులకూ ఓ మాట చెబుతున్నా. ఇప్పుడు వరుణ్‌కు పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు. ముంబైతో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇలానే వరుణ్ వేసిన తొలి ఓవర్లో దూకుడుగా పరుగులు రాబట్టాడు. దాంతో వరుణ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది’ అని క్రిష్ శ్రీకాంత్ వెల్లడించాడు.

# ముంబై ఇండియన్స్ ఘన విజయం



ఐపీఎల్‌లో దశాబ్దానికి పైగా తమను వెంటాడుతున్న ఆరంభ మ్యాచ్ ఓటమి నుంచి ముంబై ఇండియన్స్ గట్టెక్కింది. 2012లో చివరిసారిగా తమ తొలి మ్యాచ్ గెలిచిన జట్టు ఆ తర్వాత గత సీజన్ వరకు ఆడిన 13 మ్యాచ్‌ల్లోనూ ఓడింది. కానీ ఈసారి మాత్రం కదం తొక్కింది. బౌలింగ్‌లో విఫలమైనా.. భారీ ఛేదనలో ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 81), రోహిత్ శర్మ (38 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 78) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. దీంతో ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్లతో గెలిచింది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 4 వికెట్లకు 220 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానె (40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 67), రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 51), ఫిన్ ఆలెన్ (17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 37), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్లతో 33 నాటౌట్) రాణించారు. శార్దూల్ ఠాకూర్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా శార్దూల్ నిలిచాడు.

221 పరుగుల భారీ ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో సాగింది. ఓపెనర్లు రోహిత్, రికెల్టన్ బౌలర్లను చెడుగుడు ఆడేశారు. బౌండరీల వరద పారించారు. మూడో ఓవర్‌లోనే రోహిత్ 6, రికెల్టన్ 6,6తో 19 రన్స్ వచ్చాయి. ఐదో ఓవర్‌లో రోహిత్ 4,6,4తో 15 రన్స్ అందించాడు. ఆరో ఓవర్‌లో మరో రెండు సిక్సర్లతో హిట్‌మ్యాన్ 23 బంతుల్లోనే ఐపీఎల్‌లో 50వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పవర్‌ప్లేలో జట్టు 80 పరుగులతో అదరగొట్టింది. అటు రికెల్టన్ తొమ్మిదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కళ్లు చెదిరే షాట్లతో ఆకట్టుకున్న రోహిత్ 12వ ఓవర్‌లో 4,6 బాదినా అనుకుల్ వెనక్కి పరిగెడుతూ అందుకున్న అద్భుత క్యాచ్‌తో వెనుదిరిగాడు. దీంతో తొలి వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే సారథి సూర్య (16), రికెల్టన్ వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అప్పటికే మెరుగైన స్థితిలో నిలిచిన ముంబై.. హార్దిక్ (18 నాటౌట్), తిలక్ (20) జోరుకు ఐదు బంతులు మిగిలుండగానే గెలిచింది. వాంఖడే వికెట్‌పై పచ్చిక ఉండడంతో టాస్ గెలిచిన ముంబై బౌలింగ్ ఎంచుకుంది. కానీ కేకేఆర్ జోరుకు వారి వ్యూహం బెడిసికొట్టింది. ఓపెనర్లు రహానె, ఆలెన్ ఎదురుదాడితో ఆరంభం నుంచే పరుగుల వరద పారింది. ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఆలెన్ టీ20 వరల్డ్‌కప్ ఫామ్‌ను కొనసాగించాడు. మూడో ఓవర్‌లో అతను 4,6,6తో 17 రన్స్ అందించాడు. తర్వాతి ఓవర్‌లో రహానె 6,6.. ఆలెన్ 4,4,4తో హార్దిక్ 26 రన్స్ సమర్పించుకున్నాడు. బుమ్రా వేసిన తొలి ఓవర్‌లోనూ 11 పరుగులిచ్చాడు. అయితే జోరు మీదున్న ఆలెన్‌ను శార్దూల్ పెవిలియన్ చేర్చగా తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే జట్టు పవర్‌ప్లేలో 78/1 స్కోరుతో ఆధిపత్యం చూపింది. 8 ఓవర్లలోనే స్కోరు వంద దాటగా.. శార్దూల్ మరోసారి అండగా నిలిచి గ్రీన్ (18) వికెట్ తీశాడు. మరో ఎండ్‌లో రహానె ధాటిని కొనసాగిస్తూ 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే మధ్య ఓవర్లలో పరుగుల వేగం కాస్త తగ్గింది. దీనికి తోడు కుదురుకున్న రహానెను శార్దూల్ అవుట్ చేశాడు. అయితే రఘువంశీ బ్యాట్‌కు పనిజెప్పడంతో జట్టు రన్‌రేట్ మళ్లీ పుంజుకుంది. 15వ ఓవర్‌లో అతడి క్యాచ్‌ను రోహిత్ వదిలేశాడు. అదే ఓవర్‌లో అతను 4,6తో 17 రన్స్ అందించాడు. కానీ 28 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేశాక రఘువంశీ 19వ ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికే అతను నాలుగో వికెట్‌కు రింకూతో కలిసి 30 బంతుల్లో 60 రన్స్ జోడించాడు. చివర్లో బుమ్రా తన రెండు ఓవర్లలో పరుగులను కట్టడి చేసి కేకేఆర్ స్కోరును 220కి పరిమితం చేశాడు.




# ఏప్రిల్ 3న 'నీలిర'




తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు సమర్పణలో, నవీన్ చంద్ర, సనంత్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'నీలిర'. ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా చిత్రబృందం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే..1988 నాటి శ్రీలంక అంతర్యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమని తెలుస్తోంది. కథ ఒక సందడిగా సాగే వివాహ వేడుకతో మొదలై, ఒక్కసారిగా యుద్ధం సృష్టించిన బీభత్సం వైపు మళ్లుతుంది. మారణహోమం మధ్య ఒక కుటుంబం ఎదుర్కొన్న ప్రాణభయం, మనుగడ కోసం వారు పడ్డ ఆవేదన, అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని దర్శకుడు సోమీధరన్ వెండితెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించారు. ఈ సినిమాలో నవీన్ చంద్ర తన నటనతో ఆకట్టుకోగా, సనంత్, రూప కొడువాయూర్, కపిల వేణు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఖ అందించిన నేపథ్య సంగీతం ఈ యుద్ధ వాతావరణానికి మరింత బలాన్ని చేకూర్చింది. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ పతాకంపై కార్తికేయన్ సంతానం, కార్తీక్ సుబ్బరాజు నిర్మించిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. ఇటీవల జరిగిన సినిమా వేడుకకు వెట్రిమారన్, లోకేష్ కనగరాజ్, ఏఆర్ మురుగదాస్ వంటి దిగ్గజ దర్శకులు హాజరై, యుద్ధం వెనుక ఉన్న సామాన్య మనుషుల బాధలను ఈ సినిమా ప్రతిబింబిస్తుందని ప్రశంసించారు.

# 'లెనిన్' విడుదల వాయిదా




అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా విడుదల తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తూ.. జూన్ 26న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. 'లెనిన్' చిత్ర బృందం తరపున ఈ ప్రకటన చేస్తున్నాం. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన మా 'లెనిన్' సినిమాను వాయిదా వేస్తున్నామని తెలియజేస్తున్నాం. మా ఈ నిర్ణయానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. మా ప్రియమైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గారి 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో, సినిమా రంగంలో ఒకరికొకరం గౌరవం ఇచ్చుకుంటూ, ఆరోగ్యకరమైన వాతావరణంలో సినిమాలను కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని మేము నమ్ముతున్నాం. రామ్ చరణ్ గారికి, అఖిల్ గారికి మధ్య ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. అఖిల్ గారికి చరణ్ గారు ఎప్పుడూ మంచి కోరే శ్రేయోభిలాషి. అందుకే, ఎంతో గౌరవంతో మేము ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించాలన్నదే మా లక్ష్యం. 'లెనిన్' చిత్రం అన్ని రకాల భావోద్వేగాలతో నిండిన ఒక పర్ఫెక్ట్ సినిమా వేడుకగా ఉంటుందని మీకు హామీ ఇస్తున్నాం. మా బృందం అత్యుత్తమ పనితీరుతో ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకువస్తుంది. అందుకే, 'లెనిన్' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2026 జూన్ 26న విడుదల చేయాలని నిర్ణయించాం. మీరు మాపై చూపిస్తున్న ప్రేమకు, అందిస్తున్న మద్దతుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం' అని లెనిట్ టీమ్ తెలియజేసింది. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన ఒక సంపూర్ణ సినిమాటిక్ అనుభూతిని 'లెనిన్' అందిస్తుందని, అత్యుత్తమ రూపంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం హామీ ఇచ్చింది. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.






# రికార్డులను బద్దలుకొడుతున్న ధురంధర్-2

ధురంధర్-2 చిత్రం వసూళ్లలో దూసుకుపోతోంది. ఈ చిత్రం ఇప్పటి వరకు రూ.1,128 కోట్లు గ్రాస్ వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. సినిమా విడుదలైన పదిరోజుల్లోనే ఈ స్థాయిలో కలెక్షన్లు వసూలు చేయడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 18,456 షోలు పడ్డాయి. ధురందర్, ధురందర్-2 రెండు సినిమాలు కలిపి దంగల్, బాహుబలి, పుష్ప చిత్రాల జీవితకాల కలెక్షన్లను దాటాయి. ధురంధర్-2 తొమ్మిదో రోజు హిందీలో రూ.41.55 కోట్లు, తెలుగులో రూ.2.85 కోట్ల వసూళ్లు రాబట్టింది. అదే సమయంలో బాహుబలి-2, పుష్ప-2 చిత్రాలతో పోలిస్తే మాత్రం ధురంధర్-2 చాలా వెనుకబడి ఉంది. కానీ చిత్రం విడుదలై పది రోజులు మాత్రమే కావడంతో ఆ చిత్రాలను అధిగమించడానికి అవకాశాలు ఉన్నాయని సినీ పండితులు భావిస్తున్నారు.

బాహుబలి-2 రూ.1,810 కోట్లు, పుష్ప-2 రూ.1,800 కోట్ల వసూళ్లు రాబట్టాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ సినిమా దంగల్. ఈ చిత్రం రూ.2,024 కోట్ల వసూళ్ళు సాధించి రికార్డును అలాగే పదిలపరుచుకుంది. మిగిలిన అన్ని సినిమాలు టిక్కెట్ ధరలను పెంచి విడుదల కాగా, ధురంధర్ మాత్రం టిక్కెట్ ధరలు పెంచకుండానే వసూళ్లను సాధిస్తుండటం గమనార్హం.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**